


భక్తులు

జీవిత చరిత్ర

గుహుడు





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

గుహుడు

PUBLISHER :

Pali Pera Raju,

ELLORE.

1932

 4 Annas.

గుహుడు

గీ. జలదములనుండి పిడుగులు ♦ జాఱునట్లు
మంచివారికి ఖలులు జ ♦ నించుచుంద్రు

(చి|| లక్ష్మీనృసింహకవి.)

ఇక్ష్వాకునృపాలుండు రఘువంశములోనివాఁడు. ఈ యిక్ష్వాకుని కడఁగొట్టు కొమరుండు దండుఁడు. దండుఁ డతి క్రూరుఁడు. పిన్ననాటనుండి తలిదండ్రులు వీని నెంతయో వృద్ధిలోనికిఁ గొనిరావలయునని విశేషమగు కృషిఁ జేసిరి. కాని ప్రయోజనము లేకపోయెను. అందుచే దండునకుఁ జదువు సంధ్య లేమియు నబ్బినవికావు. చదువురాకున్నను గృహకార్య నిర్వహణమునందేమి, రాజకీయ కార్యములందేమి యాతనికిఁ బ్రసక్తిలేదు. కానితీఱుబడియు లేదు. వీథులలోఁ గొంటెపిల్లలతోఁ గలిసి క్రూరకార్యము లొనర్చి వంశమున కపకీర్తిఁ దెచ్చుట కన్న సుఖముగాఁ దినుచు నింటఁ గూర్చున్నఁ జాలునని వాని తలిదండ్రుల యాశయము. కాని వారి యాశయము నాతఁడు తీర్చువాఁడా? ఎల్లప్పుడును బయటనే తిరుగుచుండెడివాఁడు. సాటిబాలుర నాటలమిషచేఁ బిలిచి యేదియో మిషఁగల్పించి

వారల నందఱిఁ జావమోదుటయో, ఋషిపుంగవు లేరైనఁ
గన్పించిన వారికమండలోదకమునుఁ బారబోసియో, వారిచంకల
యందుండు దండంబుల లాగికొని కొట్టఁబోవుటయో, వారి
యునికిఁ జూచి వెక్కిరించుటయో, చేయుచుండెడివాఁడు.
ఒక్కొక్కప్పు డాడుకొనవచ్చిన బాలుర దయా
దాక్షిణ్యరహితుఁడై చంపుచుండెడివాఁడు. వాని దారుణ
బాధలఁ జూచి సహింపఁజాలక; బురుషులును, ఋషిపుంగ
వులును యిక్ష్వాకునికడ కొకనాఁ డరిగి" అయ్యా మీ కుమా
రుని దుడుకుచేష్టలు మహిమ్మాపురంబున నుండనిచ్చునటులఁ
గాన్పించుటలేదు. ప్రభుకుమారుండగుటచే నయభయంబుల
ననేక పర్యాయములు మందలించి చూచితిమి. తమతో
నెప్పటి కప్పుడే తెలుపుకొందమన్న నయ్యవి కొండెములుగాఁ
బరిణమింపఁ బడునని యింతకాల మూరకుంటిమి. ఏనాటికైన
యోగ్యత కలుగఁగూడదా యని నిరీక్షించితిమి. ఇఁక మాకు
శాంతింపఁగలిగెడి యోపికలు లేవు. మీరు మాకుఁ బాల
కులు. పాలితులు పడెడి యవస్థల నివారించెడి భారము పాల
కులపై నున్నయది. సాధుజన సంరక్షణులును ధార్మికప్రవ
ర్తనులును, సత్యమార్గానుష్ఠానపరులును, దుష్టశిక్షణ శిష్ట
రక్షణ పరాయణులును, రఘుకులాంబుధి సోములును నగు
మీరు మమ్ముల నీతరుణంబునఁ గాపాడకున్న మామూట
ముల్లెల నెత్తిపైఁ బెట్టుకొని, యాలుబిడ్డల వెంటనిడుకొని

యే కానగంతలకో, యే కొండగుహలకో, పారిపోవలసినవార మగుదుము. మీ కనిష్ఠపుత్రుండు బాలురఁబట్టి చంపుచున్నాఁడు. బాలికలను నానావిధముల హింసించుచున్నాఁడు. నీరంబుఁ దెచ్చుకొనుటకై వీధిలోని కరుగు మా యాఁడువాండ్రపై ఱాళ్లు రువ్వుట మున్నగు దుష్కార్యములఁ జేయుచున్నాఁడు. ప్రాపంచిక సౌఖ్యములకు రోసి శ్రీమన్నారాయణమూర్తిని హృదయఫలకంబున నిలిపికొని తపోవృత్తి నుండు మహనీయుల గొల్లుమని యేడ్పించుచున్నాఁడు. మాకుఁ దగిన బ్రతుకుఁ దెఱవుఁజూపకున్నచో మేమియ్యెడ జీవించుట దుర్లభము. మమ్ముల నెట్టులేని నుద్ధరించి రఘుకులాన్వయులాపద్ధారకు లనియెడి మీబిరుదంబును సార్థకపఱచుకొ"మ్మని మొఱఁబెట్టిరి. ఇక్ష్వాకునకుఁ దనయునిపైఁ గోపము వచ్చినది. "మమకారము నీసమయంబునఁ జంపుకొనకున్నఁ బ్రజాఘోషము మితిమీఱఁగలదు. కానఁ బుత్రు నెచటికేనియుఁ బ్రవాస మంపుటయే యుక్తము"మని నిశ్చయించుకొనినంతలో నప్రయత్నముగాఁ గనుఁగొనలనుండి యశ్రుకణంబులు రాలఁ జొచ్చెను. "ఆహా! రఘుకులంబున కెట్టియపకీర్తి వాటిల్లుచున్నది! తండ్రీ! విద్యాబుద్ధులు నేర్చుకొనుము. సమరపాండితి నలవడఁ జేసికొ"మ్మని యెన్నివిధంబుల బ్రతిమాలి బోధించినను బ్రయోజనము లేదయ్యె. కన్నకుమారు నెడఁబాసి పుత్రమోహము నెటులఁ జంపుకొందును? నాబ్రతు కడకత్తెరలోని

శోకచందాన నున్నదే? నేనిపు డేమిసేయుదును? ప్రవాసశిక్ష విధించిన నాటనుండియు, నిల్లాలిదుఃఖము నెటులఁ బాపుదు"నని కొంతవడి విచారించెను. గాని యెంతగ నాలోచించినను కుమారుని విడనాడుటయే శ్రేయముగాఁ దోఁచుటచే నటు లొనర్చుకొనుటకే స్థిరపఱచుకొని పుత్రుని రావించి "ఓయీ! బాలకా! నీ దారుణకర్మలఁగూర్చి జను లనేకవిధంబుల మొఱవెట్టుకొనుచున్నారు. నీకృత్యమునకుఁ దగిన దారుణ శిక్షల విధింప నధికారముఁ గలవాఁడనయ్యుఁ బుత్రవాత్స ల్యమున నటులొనర్పఁ జాలకుంటిని. కాన నీవీతక్షణమే యీపు రంబును విడిచి వింధ్యగిరిప్రాంతములఁజేరి యటజీవింపుము పో" మ్మని ముదల నొసంగెను.

తండ్రిగదా యనెడి విషయ మెటులున్నను ప్రభుని యాజ్ఞ మీఱుట కర్తవ్యతలేనందున దండున కత్తలంబు వీడి పోవక తప్పినదికాదు. ఈవార్త నాలించి దండునితల్లి యెంతయో విలపించినది; కాని లోకహితార్థమై యటులొనర్పక తప్పదని చెప్పి యిక్ష్వాకుఁడు భార్య నూఱడించెను. దండుఁ డాయూరు విడిచిపోయెను. వానినిష్క్రమణమున కాయూరిప్రజలెల్లఱును హర్షించినవారలై నాటఁగోలె సుఖముగాఁ గాలక్షేపముఁ జేయుచుండిరి. తలిదండ్రుల హితోక్తి నాలింపకున్నను, విద్యల నేర్వకున్నను, సజ్జనసాంగత్యముఁ జేయకున్నను, ఋజుప్రవర్త నము లేకున్నను, దురాకృతముల నాచరించుచున్నను జననీజనకు

లట్టి కుపుత్రత్వమునకన్న నపుత్రత్వమే శ్రేయస్కరముగఁ దలఁతు” రని యీప్రకరణము యొక్క ఫలితార్థము.

(2)

జనకునిచే వెడలఁగొట్టఁబడిన దండుఁడు వింధ్యపర్వత పరిసరప్రదేశములఁ జేరి యచట వసియించెడి రక్కసిమూఁకల సహవాసముఁ జేయుచుఁ దన దుండగపు కార్యముల విడువకఁ గ్రమక్రమముగా నా ప్రాంతముల వసియించువారలకు నాయకుఁడయ్యెను. దండుఁడు తాను నివసించు ప్రదేశమున నొకపురమును నిర్మాణముఁజేయించి యా పురంబునకు “మధువంత”మని పేరుఁబెట్టెను. ఈదండుఁ డరణ్యముల వసియించి దానవకులనాయకుండగుటచే శుక్రాచార్యుం డీతనికాచార్యుండయ్యెను. ఇప్పుడు వీనికి సంపూర్ణయౌవనదశవచ్చుటచేఁ గామాతురులకు నిష్టదైవమగు మదనుని సేవింపవలసినవాఁడయ్యెను. అతనిప్రహారణములకు లొంగవలసినవాఁడయ్యెను. ఆమదనుని దారుణప్రహారణముల కాగలేక దండుఁడు లేజవ్వనులపై దాడిసాగించి బలవద్విజయుఁడగుచుండెను. ఈతఁడు విజయలక్ష్మినార్జించుచున్న కొలఁదియు, మదనుని విజృంభణము వీనియెడ నెందులకుఁ గొఱగాకుండెను. ఆప్రాంతమున కీతఁడే ప్రభుండై యుండుటచే నాతఁ డాడినది యాటగను, బాడినది పాటగను బరిణమించుచుండెను. అదలించెడివారు లేక, పెద

రించెడివారులేక, పెచ్చుమీఱిన పొగరుఁబోతుఁదనమున వర్తించు నాతని వర్తనమున కాప్రాంతమునుండిపోవు పాంథులనేకులనేకవిధంబుల బాధపడుచుండెడివారు. వీనిబలవంతములకు లోనై హాహాకారములొనర్చెడివారు. వీనికివినాశకాలమెన్నఁడు ప్రాప్తమగునా యని దైవమును ధ్యానించుచుండెడివారు.

పాపకృత్యములెన్నాళ్ళుదాఁగియుండఁగలవు? ఎన్నాళ్లు మితిమీఱఁగలవు? దిఁడునకు వినాశకాలము చేఱువకు వచ్చుట చేతనే యొకనాఁడుకులగురుండగు శుక్రాచార్యుండాశ్రమంబున లేనిసమయంబుఁ జూచి యాశ్రమంబునకరిగి తపోనియతినున్న శుక్రాచార్యుని తనయను విలోకించి యామెరూపరేఖావిలాసంబుల కచ్చెరువంది యామె సాంగత్యము నభిలషించెను. పరకాంతల సహవాస మభిలషించుట మహాపాతక హేతువనియు, సతుల నభిలషించువార లెందఱో యిహపరంబులకు దవ్వైరనియు, మగవారులేని సమయముఁ జూచి యాశ్రమంబుఁ జొచ్చుట ధర్మవిరుద్ధమనియు, సజ్జన సహవాస మొనర్చి సదాచారములనలవడఁజేసికొని జీవించుట శ్రేయోదాయక మనియుఁ, దనతండ్రికీయుదంతము తెలిసిన శపించుననియు, నాతని శాపవచనం బమోఘమనియు హితముఁగఱపెను. కాని సన్నిపాతజ్వరముచే నొడలుఁ దెలియక ప్రేలెడి రోగికి శీతలోపచారము లక్కఱకు రానియటుల నామె హితంబులన్నియు నాతనియెడ నిష్ప్రయోజనమయ్యెను. కామా

తురుండగు దండుఁడు తన మనోభీష్టము నెట్టులేని నెఱవేర్చు కొనఁదలఁచి బలాత్కారమున సఫలీకృతమనోరథుఁడయ్యెను. వెంటనే శుక్రాచార్యుం డింటికివచ్చి కొమరితవలన నడిచిన వృత్తాంతం బాద్యంతముగ నాలించి, దండునిఁ జేరువకుఁబిలిచి "యోరీ మూర్ఖుఁడా! నీక్రూరకృత్యంబులఁ జాలకాలము నుండియుఁ జూచుచున్నను యేనాటికేని బుద్ధిరాకుండునే" యని మనంబున నిన్నొక లెక్కఁగాఁ గొనకుండనున్నంగుల కాచార్యుఁడనగు నాకే యిట్టి తలవంపుఁగూర్చితివటరా! మీ వంశమున నెన్నఁడేనినిట్టిదురాచారపరాయణులుద్భవించిరటరా రఘుకులంబునకు నీమూలమున నెట్టి యపకీర్తి వాటిల్లినదిరా! ఇదివరలోఁ బితృద్రోహవే యైతివి. ఇప్పుడు గురుద్రోహి వగుచుంటివి. నిన్నుఁ క్షమించినచో దైవద్రోహివికూడనగుదువు. లోకమున నీదుష్కార్యములు మితిమీఱఁగలవు. నిన్నుఁక విడువ రాదు. నీవు నిలుచు శతయోజన విస్తీర్ణముఁగల యీప్రదేశ మంతయు నీతో, నీస్వజనముతో రూపుమాయునట్లు మట్టివాన కురియుఁగాత" యనిశపియించెను. అమోఘమైన యాశాపవచ నమునననుసరించి యాప్రదేశమంతయు నప్పటికప్పుడే మట్టివాన కురిసి రూపరహితమయ్యెను. ఆప్రదేశమే క్రమక్రమముగా నరణ్యమయ్యెను. ఆయరణ్యమునకే "దండకాటవి" యని పేరు వచ్చినది.

చూచితిరా! దుర్మార్గకార్యము లెవ్విధిఁ బరిణమించినవో! ఎన్నటికేని దుర్మార్గమునకు వినాశకాలము రాకపోదు. దుర్మార్గులు నశింపకపోరు.

---

(3)

పూర్వ మొకఋషి యుండెడివాఁడు. వానికొక కొమరుండు కలఁడు. ఆఋషి శ్రీమన్నారాయణ చరణారవిందముల భజియించుకొనుచు జీవయాత్రను గడుపుకొనుచుండెడివాఁడు. వాని తనయుండును నటులఁ జీవించుచున్న వాఁడే. ఒక విజనారణ్యమున నొక పర్ణకుటీరము నేర్పఱచుకొని కందమూలాదులఁ దినుచు, నందుఁగల సెలయేటి నీరంబుఁ ద్రావుచుఁ గామక్రోధా ద్యరిషడ్వర్గంబులఁ ద్యజించి శ్రీ పరాత్పరునే నమ్ముకొని ముక్తికాంతను బడయవలెననెడి తలంపుతోడనే యుండెడివారు గాని యన్యప్రసంగముల జోక్యంబుఁ గల్గించుకొనెడివారు కారు. ఐనను సకల ధర్మంబుల నెఱింగినవారగుటచేతను, వారి పాండిత్యము నలుదెసలఁ బ్రాకినందువలనను, యెవ్వ రేధర్మము నెఱుంగవలె ననినను యెంతదూరమైనను లక్ష్యము సేయక, వారికొఱకై వెదకికొనుచు వచ్చి తమ యనుమానముల నివృత్తిఁ జేసికొనుచుండెడివారు.

ఒకనాఁ డాఋషి యింటికడ లేనపు డొక బ్రాహ్మణుండు వచ్చి యాశ్రమమున ముని సార్వభౌముఁడు లేఁడని యాతని కొమరునివలన నెఱింగి "ఆర్యా! నాయన గారు లేకున్నను దామును తమ తండ్రిగారిని మించినవారే యగుటం జేసి నాయొనర్చిన పాపమునకుఁ దగిన ప్రాయశ్చిత్త మేదియో యెఱింగింతురని నమ్మెదను. నేను బ్రాహ్మణుఁడ నయ్యును గాచనెయ్యంపు దోసమునం జేసి విలువిద్య నేర్చుకొన్న వాఁడనగుటచే నీమధ్య నొకనాఁడు నేనభ్యాసమునకై విడిచిన బాణమొక్కం డొకగోవునకుఁ దగులుటచే నాగోవు తత్క్షణంబుననె యసువులఁ బాసెను. ఈ గోహత్యాపాతకమునుండి నేనెటులఁ దప్పించుకొనఁగల్గుదునో యెఱింగించి పుణ్యముఁ గట్టుకొ" మ్మని వేఁడినంత నాఋషి కుమారుండు "ఓయీ! విప్రోత్తమా! శ్రీరామనామమును నాలుఁగుపర్యాయములు త్రికరణశుద్ధిగ నుచ్చరించితివేని నీకా పాతకము నశించు" నన నావిప్రుండట్లొనర్చ సమాధాన పడి యత్తలంబుఁబాసెను. కొంతసేపటికి ఋషియు నాశ్రమంబునకు వచ్చెను. తనయుండు విధ్యుక్తముగ జనకున కొనర్పవలసిన పరిచర్యలన్నియుఁ బూర్తియైన యనంతరమునఁ దాను భూసురోత్తమునకుఁ దెల్పిన ప్రాయశ్చిత్తవిధానమునుఁ గూర్చి విన్నవించెను.

అంతఁ గుమారుని వాక్యములను విని, యామహర్షి సత్తముఁడాగ్రహమంది కనుఁగవయందించుక నెఱుపుడాల్పోపఁ గొడుకుదెసఁ జూచి "ఓయీ! గోహత్య యొనర్చినాఁడల కొక్కసారి రాముని పవిత్రనామమును స్మరించినఁ జాలుఁగదా! మూఁడుపర్యాయము లెక్కుడుగ రామనామమును నిరర్థకముఁ గావింపనగునా? ఆనామము నొక్కపరి త్రికరణశుద్ధిగ నుచ్చరించినంతమాత్రముననే సకలకలుషములును వమ్ములగుచుండ, నిన్ని పర్యాయము లానామమును వ్యర్థముగా వినియోగించి లేనియధికారమును బైనవైచికొంటివి గాన నింతటి నుండి నిషాదుఁడవై పొ" మ్మని శపియించెను.

తండ్రిగారొసంగినశాపమాతని దుఃఖార్ణవమునముంచివైచినది. తనదుర్గతికిఁ దానెంతయో వగచెను. కొంతవడి కంతువలనఁ బ్రయోజనములేదనియు, నెట్టులేనిఁ దండ్రిగారిని శాంతచిత్తునిఁ గావించుటయే సర్వవిధంబుల నుత్తమ మనియు నెఱింగి తండ్రిగారి పాదంబులపైఁబడి "తండ్రీ! అవివేకవశమున నిట్టి యపరాధం బొనర్చితిని. ఎట్టులైన నన్ను మన్నించి శాపవిముక్తునిఁ జేయవే" యని ప్రార్థింపఁ గొంతవడి కించుక జాలికలిగి "శివునిమూఁడవకంటిమంటయు, నింద్రునివజ్రాయుధఘాతమును పతివ్రతకోపదృష్టియు, ఋషిశాపమును రిత్తవోవునే? నాయనా! స్వయంకృతాపరాధమునకుఁ దత్ఫల మనుభవింపక పోరాదు. నిన్నా రామచంద్రమూర్తియే కాపాడఁగలఁడు. శాప

గ్రస్తుఁడవై నీవు నిషాదుఁడ వగుచున్నను రామభక్తిఁ గలిగి. పవిత్రిలితివా నిన్నారామభక్తియే ధన్యునిఁ జేయఁగలదు. అందులకై నీవెంతమాత్రమునుజింతిల్లవల"దని యూరడించెను. ఆఋషికుమారుఁడే మన కథానాయకుఁడైన గుహుఁడు. వాని కథనుగూర్చియే ముందు మీరు పఠింపఁగలరు.

(4)

ఇక్ష్వాకువంశ పయఃపారావార రాకాసుధాకరుండును, నయోధ్యానగరాధీశ్వరుండును నగు దశరథుండు పుత్రసంతానము లేమింజేసి పుత్రకామేష్టి నొనర్చుటయు, నందులకు ఫలితంబుగా నొకదివ్యపురుషుండు పాయసాన్నంబునొసంగుటయు, నాభూవరుండాపాయసాన్నంబును దన ముగ్గురు భార్యలకును భుజియింపనిచ్చుటయుఁ, దత్ఫలితంబుగా వారలకు శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్ను లనెడి నలువురు పుత్రులు జన్మించుటయు, దశరథుండు వారల నతి గారాబమునఁ బెంచుకొనుచుండుటయు, నింతలోగాధేయుఁడు తనయాగంబునకురాక్షసుల వలన విఘ్నంబు లనేకంబులు జరుగుచున్నవని తద్రక్షణార్థమై శ్రీరామునిసహాయ మపేక్షించివచ్చి దశరథునిఁ గోరుటయు నాతండు విడువలేక విడువలేక శ్రీరాముని లక్ష్మణ సమేతముగా విశ్వామిత్రుని వెంట నంపుటయుఁ, దోవయందు శ్రీరాముఁడు తాటకనుసంహరించి మారీచ సుబాహుల దర్పం

మడంచి పతిశాపవశమునఁ బాషాణమయియున్న యహల్యను శాపవిముక్తఁ గావించి, మిథిలాధీశ్వరుండగు జనకుని యింట నున్న శివచాపంబును రెండుగాఁగావించి జనకుని ప్రకటనాను సారముగ సీతామహాసాధ్విని బెండ్లియాడుటయు, నయోధ్యకుఁ దిరిగి వచ్చునపుడు పరశురాముని గర్వంబూడ్చుటయు, మీరందఱుఁ దెలిసికొనియుందురు. పదంపడిదశరథుండు తనకబ్బిన వార్ధకదశచే జీవితకాలముననే సత్యమార్గాను వర్తియు, ధర్మమూర్తియు, గృపాలవాలుండును, సమస్త కల్యాణగుణగణాభిరాముండును, బాహువిక్రమోద్దాముండును, విజయస్థేముండును, వైభవ నిర్జిత సుత్రాముండును, సత్కాముండును, బరంధాముండును నగు శ్రీరామునిఁ బట్టభద్రునిఁ గావించి వానిపరిపాలనా చాకచక్యమునుఁ గని యానందింపఁ దలఁచి, ప్రజానుమతిని బడసి నిజపురోహితుండగు వసిష్ఠునిచే సుముహూర్తము నిశ్చయింపఁజేసెను.

శ్రీరామచంద్రుఁడెవ్వఁడో యెందులకై మానవాకృతిని దశరథక్ష్మాపాలున కుద్భవించెనో వసిష్ఠమునిచంద్రునకు బాగుఁగాఁదెలియును. తానునిశ్చయించిన ముహూర్తము కొంచెఁగానిదనియు నెఱుంగును. పట్టాభిషేకముహూర్తమునకు విఘ్నంబు కలిగిన బాగుండునుగదా యని లోలోన నువ్విళ్ళూరుచునే యుండెను. కాని తన యభిప్రాయము బైకిఁ దెలియనీయఁడు.

కౌసలేయుండు సామాన్య మానవుఁడుకాఁడు. అయోధ్యానగరంబునసింహాసనముపైఁగూర్చుండిసామంతరాజులకప్పంబులఁగొనుచు బొక్కసమును వృద్ధిఁజేయుచు సుఖముగాఁ గాలాక్షేపముఁ జేయుటకై జన్మించిన వాఁడునుఁ గాఁడు. ఇష్టభోగములఁ దనివిఁదీఱ ననుభవింపఁ బుట్టినవాఁడును గాఁడు. లోకకంటకులగు రావణాదుల దారుణబాధల కాగఁజాలక దేవతావర్గము శ్రీమహావిష్ణునికడ కరిగి తమ యాపన్నివారణార్థమై మొఱఁబెట్టుకొన, నాతండు దశరథునకు కొమరుఁడనై జన్మించి దానవవంశ నిర్మూలన మొనర్చి లోకమున శాంతిఁ బ్రతిష్ఠించెద" నని యభయం బొసంగుటచేఁ; దన సమయానుకూలముగ మానవావతారమెత్తిన శ్రీవిష్ణుమూర్తి. ఈ రహస్యము వసిష్ఠుఁ డెఱుంగును. ధనుర్విద్యాది కళల నలవడఁ జేసిన విశ్వామిత్రుండుసైత మెఱుంగును. కావలసినది దానవసంహారము. అందుకొఱకై శ్రీరామచంద్రుఁ డరణ్యముల కరుగవలయును. అందుల కేదేని నొక మిషఁ గల్పింపవలయును. వసిష్ఠ విశ్వామిత్రాది మహర్షులే, శ్రీరాముని జన్మవృత్తాంత మెఱింగినపుడు దేవతలకీరహస్యమేలఁదెలియదు? అందులకనియే పట్టాభిషేకమున కేలగ్నమును వసిష్ఠుఁడు నిశ్చయించెనో; ఆనాఁడే దేవతలందఱు నొక్కచోఁ గూడి "రావణ సంహారణార్థమై మానవాకృతి నూనిన శ్రీమహావిష్ణువు తన విధికృత్యమును మఱచి; నేట రేపట నయోధ్యా

నగరంబునఁ బట్టభద్రుఁడు గానుండె. అటుల జరిగినచో మనకు దానవులబాధ లెటులఁ దప్పగలవు? లోకంబునకు శాంతి కలుగునా? అదియుఁ గాక దశరథున కింకఁ బదునాలుగు ఘడియలును, రావణునకుఁ బదునాలు గేఁడులును మాత్రమే కదా యాయువున్నది? వీరి యాయువులను సకాలమునకుఁ బూర్తిచేసి మనవిధులను నిర్వర్తించుకొనవలదా? అందుల కేదేని నొకపన్నుగడఁ బన్నవలదా? సకలలోక రక్షకుఁడగు శ్రీమన్నారాయణమూర్తియే యిటు లుపేక్షసేసిన మన యగచాట్లఁ దప్పించువారెవ్వరు? మాటముల్లెలఁ గట్టుకొని యాలుబిడ్డలతో నెటకుఁజేరి తలలు దాఁచుకొనఁగలము? సర్వమయుండగు, నారాయణుఁడే యిట్టు లుపేక్షయొనర్చిన మనకు నిలువ నీడయేది? కాన మనము జాగరూకులమయి శ్రీరాముని పట్టాభిషేకమునకు భంగముఁగలుగఁజేయు తెఱవునాలోచింపవలయు" నని తమలోఁ దాము సంభాషించుకొనుచుండ సతీయుతుఁడై యొకచో నా సభయందుఁ గూర్చుండిన విధాత తన భార్యదెసఁ జూచెను. దాత మనోభీష్టమును గుర్తించినది సరస్వతి. వెంటనే లేచినది. సభవంకఁజూచినది.

సభాసదులారా! మీరంద ఱేల్లల దిగులుఁ జెందెదరు? ఆకార్యభారమంతయు నాపై నుంపుఁడు. పట్టాభిషేకసమయమున శ్రీజానకీరాములను జక్కగ నలంకృతులఁ గావింపవలె ననెడి యుత్సాహముతోఁ గైక చెలికత్తెయగు మంథర

యుద్యానవనంబుఁజేరి తదేకనిష్ఠతోఁబూవులసేకరించి మాలికల గుచ్చుచున్నది. శ్రీరామచంద్రుఁ డొకప్పుడు తన్నేదియో నొకకారణమున మందలించెననెడిహేతువుచే సమయము వచ్చి నపుడు శ్రీరామచంద్రునకు ప్రతిక్రియఁ జేయవలెననెడి దురభిప్రాయమున నున్న మంథర తన క్రోధమును తానే మఱచి పోయినది. నేనిప్పుడే పోయి యామెజిహ్వాగ్రమునఁ బ్రవేశించెద. ఆబిడ యుత్సాహమున కంతరాయముఁ గల్పించెద. మదీయ ప్రభావముచే నామెను దాండవ మాడించెద. దశరథుఁడు మున్నొక్కప్పుడు కైకకొసంగిన వరంబుల నామె హృదయమునఁ బ్రవేశపెట్టెద. ఆవరంబుల మాటయే మఱచి శ్రీరామపట్టాభిషేక విలోకనార్థమై నిముషముల లెక్కఁ బెట్టుచు నానందపారవశ్యయై యుప్పొంగుచున్న కేకయరాజ తనయ కారెండువరంబుల విషయంబు జ్ఞప్తికిఁ దెప్పించి విచిత్ర నాటక మొక్కండుఁ బ్రదర్శింపఁ జేసెద. శ్రీరామున కరణ్యావాసప్రాప్తిఁ గల్గించెద. అంతట మీకోరికలన్నియు నెఱవేఱఁ గల” వని పలుక నామె యాలోచనమున కందఱును హర్షితస్వాంతులై యట్టులొనర్ప సమ్మతించిరి.

5

భారతీదేవి యత్నము సార్థకమైనది. శ్రీరామున కరణ్యావాసమును వల్కలాజినధారణమును సంప్రాప్తమైనవి.

తన్నుఁడబాయఁజాలక వెంటఁబడిన సౌమిత్రితోడను, "పతితోడిదియే సతికి లోకం" బనియెడి సతీధర్మంబును బాటించి వెంటవచ్చెదనని మారాముఁజేసిన జానకీదేవితోడను, వనంబుల కరుగుటకు నిశ్చయించుకొని, స్వజనంబునెడఁగల ప్రేమపాశ బంధముల సడలించుకొని సుమంత్రునిచేఁ గొనిరాఁబడిన రథమధిరోహింపసంసిద్ధుఁడయ్యె. శ్రీరామమూర్తియొక్క ప్రవాసమును గూర్చి వినిన ప్రజలెల్లయును రాముఁడులేని రాజ్యమందుండనోల్లక, వాని వెంబడింప మూటముల్లెలఁగొని యాలుబిడ్డలతోఁ గూడి ప్రయాణసన్నాహులై వచ్చి రథంబును వెంబడించిరి. "రామా! సకల సుగుణాభిరామా! రవికులాంబుధిసోమా! సంసార భీకరజలధి తరణివి, ధర్మాధర్మ విచక్షణదక్షుఁడవు, పితృవాక్యపరిపాలనా ధురంధరుఁడవు, సత్యపథానువర్తివి, ఎన్నో తపంబులఁ జేసి మిమ్ముఁ దనయులఁగాఁ బడసిన జననీజనకులఁబాసి, భాగ్యభోగంబులఁ దృణీకరించి, యిప్పటికన్న నెక్కుడు సుఖములు మీ పరిపాలనములోఁ బొందెదమని గంపెడాశతోనున్న మమ్ము వదలి యరణ్యముల కేగఁదలంచితివా? తండ్రీ! మా పాలిఁటనేగాక, ధర్మదేవతకును, సత్యదేవతకును, దైవమవు. ఆధర్మదేవతయు, సత్యదేవతయు నీ వియోగమును భరియింపనోల్లక నీ స్యందనమునకు ముందుగనే నడువ సిద్ధమైనవి. చూచితివా! రామచంద్రా! మా కింకెవ్వరు దిక్కు? నీ వియోగమునకు నీ తండ్రి

ఱుఁక బ్రతుకునే! వాని యవస్థఁ జూచుచు నీ తల్లి జీవించునే! ఇటుల నీ యిక్ష్వాకువంశమును క్రమముగాఁ ద్వరలో నంతరింపఁ జేయఁదలఁచితివా ? నీతో మమ్ములఁ గూడఁ గొనిపొమ్మని రోదనము సేయసాగిరి. రథము నడుచుచున్నది, శ్రీరామమూర్తి వారి నెట్టులేని సమాధాన పఱచవలెనని యెంతగనో ప్రయత్నించెను. కాని తత్కాలమున వాని కోరిక నెఱవేఱలేదు. శ్రీరామచంద్రుని సుగుణసంపదలఁ గీర్తించుకొనుచు వాని యెడఁబాటునకు వగచుచు రథము వెంట నయోధ్యాపురవాసులు తండోపతండములుగ నడుచుచు వచ్చుచుండుటచే వారల సాధనాంతరముల శాంతింపఁ జేయవలయుననెడి యాశయముతోఁ దేరును మెల్లఁగా నడుప సుమంత్రునకు శ్రీరామచంద్రుఁ డనుజ్ఞ నిచ్చెను. అందుచే నాసాయంసమయంబునకు రథంబు సరయూనదీ తీరమునకు మాత్రమే చేరఁగల్గెను.

శ్రీరాముఁడు లక్ష్మణునితోడను, భార్యతోడను రథంబుడిగ్గి యానాటి కచ్చటనే విడిసెను. కాని శ్రీరాముఁ డూరకుండలేదు. వెంటవచ్చిన జనమున కంతకు నటఁగల ప్రకృతి విచిత్రములఁ జూపుటతోడను, వారినందఱి నెట్టులేని సాగనంపవలెనని యనేక విధములగు హితోపదేశ వాక్యంబులతోడను నారేయియెల్లఁ గడిపెను. మఱునాటి యుదయంబున శ్రీరాముని హితోక్తుల నాలించిన ప్రజలు వెనుకకుఁ దిరిగి

పోవుట కనుమతించి శ్రీరామాజ్ఞను బడసి వెడలిరి. ఇఁక సుమంత్రుఁడుమాత్రమే మిగిలెను. ఈతఁడును వీరిని నదీతీరమునకుఁ జేర్చి వెనుకకు వెడలవలసినవాఁడే. కావున సుమంత్రునకు దిగులు హెచ్చుకాజొచ్చెను. వాని వైఖరిని గుర్తించి శ్రీరాముఁడు "సుమంత్రా! నీవుఁగూడ మమ్ము వీడి వెడలవలయుఁ గదా! నాతండ్రిగారికిని, తల్లిగారికిని, చిన్నమ్మలకును,తదితరపెద్దలకును, ముఖ్యముగ మాకులగురుండగు వసిష్ఠమునిచంద్రునకును నమస్కరించితి" నని చెప్పుము. పిన్నలకు దీవెనల నెఱింగింపుము. నన్నుఁగూర్చి విచారింపవలదని ప్రార్థించితినని యెల్లఱకుఁ దెలుపుము. మఱియు, సుమంత్రా! నీకొక రహస్యముఁ దెలిపెద నాకర్ణింపుము.

"నలువ మనల సృష్టించునపుడు ఫాలతలంబున వ్రాసిన వ్రాతను మనము తప్పించుకొనఁ జాలము. మమకారాదులఁ బెంచుకొని యెవరెంత విలపించినను ప్రయోజనములేదు. భగవంతుఁడు నన్నెందుల కీజన్మమెత్తించెనో నన్నేరీతి జీవింపఁజేయ దలఁచెనో, నానిర్యాణమెటు లున్నదో యేమని చెప్పఁగలను? నాకీయరణ్యవాసప్రాప్తిని గలుగఁజేయుటయందు భగవంతుని యుద్దేశమేమో మనమెంటుల గ్రహింపఁ గలుగుదుము? కాని యొక విషయమును మాత్రము మనము సులభముగాఁ దెలిసికొన నగును. ఆపరమాత్మ మనకొక కష్టమును బ్రాప్తింపఁ జేసినపుడు దానికేదియో మహత్తరమగు కారణ ముండక

పోదు. క్రూరరాక్షసులవలన లోకమెంత కటకటఁ బడు
చున్నదో! క్రూరమృగ సంకులంబగు నడవిని పాంథులేవిధి
హింసింపఁ బడుచుండిరో? అందులకుఁ గాను లోకమునకు
నేనెట్టిసేవఁ జేయవలయునో? ఆభగవంతుఁడు నాకీ యర
ణ్యవాసోద్యోగమిచ్చుట లోకోపకారమునకేయని తలఁచెద.
ఇయ్యది మనము సంతసింపవలసిన విషయముగాని యీశ్వర
ప్రేరితకార్యమున కెద్దానికిని మనము విచారింపరాదు. క్షత్రియ
కులోద్భవుండనై, రణధర్మముల నామూలాగ్రముగ నభ్యసించి,
మేటిబలాఢ్యుఁడనని పేరుఁ బెట్టుకొనినందుల కింటఁ గూర్చుండి
తలిదండ్రుల గారాబముల నందుచు, ముఖప్రీతికొఱకై వారు
వీరు చేయుస్తుతుల నాలింపుచు నాలితోఁ గూడి సరససల్లా
పంబులతోఁ బ్రొద్దుఁబుచ్చుచుఁ దమ్ములతోఁ గ్రీడావిలాసంబు
లొనర్చుచు జన్మమును నిరర్థకముఁ జేసికొనినచో మనపరిపాల
నమునందలి సరిహద్దులలో నున్న యరణ్యంబులయందుఁ బర్ణ
శాలల నేర్పరచుకొని వాతాంబు పర్ణాహారులై శ్రీహరినామో
చ్చారణా తత్పరులై కాలంబుఁ గడపుచున్న తాపసుల క్షేమం
బుల విచారింపలేదని కలిగెడి యపవాదమును భరియింప
వలదా! అందుచే నాకీప్రవాసశిక్ష యెంతయు సహ్యమైనది. మఱి
యొక విశేషము. తాపసులదర్శనము నాకుఁ దఱచు లభియింపఁ
గలదు. వారిపాదాశ్రయముసకలమానవులకును నవశ్యవాంఛనీ
యము. వారిహితవాక్యంబులననవరతమాలించుచుమనజీవితముల

సార్థక మొనర్చుకొననగును. జగన్మాన్యతను గూర్చియు, సర్వ భూతదయను గూర్చియుఁ, బరోపకృతిని గూర్చియు, నింకను యోగ్యములైన విషయంబులను గూర్చియు వారినోట వినుచున్నపుడు మనకుఁ గలిగెడి యానందమునకు మేఱకలదా!" యని హితంబుఁ గఱపుచు బుజ్జగించెను.

సీతాలక్ష్మణు లీప్రసంగముల నతి శ్రద్ధాభక్తులతో నాలించుచున్నవా రగుటచే నెప్పుడు మన మాయరణ్యములఁ జేరుదుమా, ఎన్నఁ డామహానీయుల దర్శించి వారి హిత వాక్యంబుల నాలింతుమా, వారి పాదముల నెప్పు డాశ్రయింతుమా: యనెడి యాతురమునే జూపుచుండిరి. కాని తమయెడఁబాటు వలన నింటికడ విలపించుచున్నవారి గోడవయే తలంపునకుఁ దెచ్చుకొనుట లేదు. కాదా మఱి.

లోకకల్యాణము నొడఁగూర్ప నవతరించిన పరాత్పరుని సాహచర్యము లభియించినది. విఖ్యాత పురుషులను, శ్రీమన్నారాయణ పదారవింద భజనానంద సంయుక్తులను దర్శించి ధన్యులయ్యెడి వీలు చిక్కినది. ఈయవకాశము నెవ్వరు చెడఁ గొట్టుకొందురు? సమయమునకుఁ జెడఁగొట్టుకొని పడంపడి విచారించిన మాత్రము ప్రయోజనమున్నదా !

చచ్చునపుడు; నెంటరాని భోగభాగ్యంబులను, బంధుమిత్రులను విడలేక, నధోగతిలో మునుంగుదురా!

[6]

గంగ పరమ పావనమైనది. అయ్యది శ్రీమహావిష్ణువు యొక్క పాదంబులయం దుద్భవించినది. ఆ వియన్నదియందు స్నానమొనర్చుచో సకల కలుషమ్ముల నాశమ్మొనర్తునని సర్వకాలంబులందునను సర్వమానవులకును స్వాగతం బిచ్చుచుండును. మఱియు నానదీజలము మానవుల కారోగ్యదాయకమై దనరారుచుండును. పావనంబగు నానదీ నీరంబు శాంతిశమ దమాది సద్గుణంబుల నలవడఁజేయును. మేధాశక్తి వృద్ధిఁ జేయును. భగవంతునియెడ ననురాగమును గలుగఁజేయును. మహాపర్వదినంబులయందానదీమతల్లికి భక్తులగువారు పసుపుఁగుంకుమలతోఁ బూజింతురు. విశేషముగా తమహృదయముసైతము సమర్పింతురు. ఆదివ్యస్రవంతి ప్రవహించు ప్రదేశమంతయు నతిపవిత్రవంతమైన దగుటచే నాయా ప్రాంతముల వసియించెడి ప్రజలు తమప్రదేశములను మహాక్షేత్రములని వాకొందురు. దివ్యస్వరూపుఁడును పరాత్పరుఁడును నగు శ్రీమన్నారాయణుం డనేక రూపములతో నానదీతీరంబుల నచ్చటచ్చట వెలయుచుఁ దన్ను నమ్ముకొని జీవించువారి నేదోవిధముగాఁ దనకడకు రప్పించుకొని వారి యాశయముల నెఱవేర్చుచుండును. ఇట్టిమహత్తర శక్తిగల యానదిని యిప్పుడు శ్రీరామచంద్రమూర్తి దాఁటవలయును ఆనదిని దాఁటుట కొక నావకలదు. మనకథానాయకుఁడగు

గుహుఁడేయానావకధికారి. గుహునిపూర్వజన్మవృత్తాంతమును మీరు మూఁడవ ప్రకరణమునందుఁ బఠించియే యున్నారు. వాని విశేషముల మఱికొన్నిఁటి నీక్రింది ప్రకరణంబునఁ బఠింపఁగలరు.

(7)

తండ్రిశాపవచనముల ననుసరించి మునిబాలుఁడు నిషాదకులంబున జన్మించి గుహుండను పేరుఁగాంచి యనాగరిక ప్రదేశమగు నా యరణ్యప్రాంతమున నావికావృత్తితోఁడను, కులవృత్తితోఁడను జీవించు చుండెను. బాల్యమునుండియు దయా సత్య శౌచముల ననుష్ఠించుచు శ్రీరామనామసంకీర్తనానందుఁడై ప్రవర్తించుటచే నతనిజన్మము సార్థకమై దనరారు చుండెను. నిషాదులనిన నిన్నమొన్నటివఱకును వారి పూర్వవృత్తాంతముల సరిగా నెఱుంగఁజాలము. మనము పల్లెకులజులని తలఁచుచుండెడివారము. ఇప్పుడో ఆ కులజులు తమ పూర్వవృత్తాంతమును దెలిసికొని తా మగ్నికులక్షత్రియులని పేరుఁగాంచుచున్నారు. ఆ కులజుల నటులనే వ్యవహరింప, మన ప్రభుత్వమువారు ముదల నొసంగిరి. ఇప్పుడాకులజులు నాగరికత నలవడఁజేసికొని విద్యాబుద్ధులనేర్చి యుద్యోగములఁ జేయుచుఁ గీర్తిఁ గాంచుచున్నారు. పూర్వ మొకప్పుడీకులజులు ప్రపంచమందలి యన్నిభాగముల సంచరించుచు నోడవర్తకమునందు సుప్రసిద్ధులై మన భరతఖండమునకు వన్నెఁ

దెచ్చి యున్నారు. కాలక్రమమున నిప్పుడావిఖ్యాతి నామ మాత్రావశేషమై యున్నను మఱల నా కులజులు కన్నులు తెఱచి తమ పూర్వగౌరవమును బునరుద్ధరించుకొన విశ్వ ప్రయత్నములఁ గావించుచున్నారు. శ్రీరామచంద్రమూర్తి వారి ప్రయత్నముల జయప్రదము గావించి యా కుల జుల సన్నిధంబులఁ గాపాడుఁగాక. గుహుండు నిషాదుఁడై జనించిన నాఁటఁగోలె రామనామపఠనముఁ జేయుచుండె నని చెప్పియుంటిమి. అంతటితో నాతండు తనివిఁజెందకఁ దనపురంబున వసించువారి నెల్లఱ రామభక్తులఁ గావించెను. కాని శ్రీరామచంద్రుని యాకృతి యెట్లుండునో, వాని వర్త నాదికము లెట్టివో స్వయముగాఁ బరికించి యెఱుంగఁడు. ఐనను దశరథక్ష్మాపాలుని తనయుండనియుఁ, దనకుఁ బ్రభుం డనియు, విశేషించి మోక్షప్రదాతయనియు, భగవంతుఁ డనియుఁ, దన్నునమ్మి సేవించువారి కిహపర సౌఖ్యంబులం దేలోటుపాటులు రాకుండఁ గాపాడఁగలఁడనియు, దయా సత్యశౌచశాంతిశమదమాద్యనేక సద్గుణంబుల కలనాటు పడ వలయు ననిన వాని పవిత్ర నామస్మరణమే తగిన మార్గ మనియు మాత్ర మాతఁడెఱుంగును. సుఖములు చేకూఱినను దుర్భర దురంత కష్టములు వెన్నాడినను నవి యన్నియు శ్రీరాముని యనుగ్రహము వలననే సంప్రాప్తమయ్యెనని తలంచును. కాని సుఖములకు సంతోషించి యెఱుంగఁడు.

కష్టములకు విచారించి యెఱుఁగఁడు. కలిమికలిగిననాఁడు మైమఱువఁడు. లేమిదశయందుఁ బ్రలాపించియెఱుంగఁడు. ఆతని నేత్రములకు గోచరములగు సమస్త జీవరాసులును, సకల చర్యలును శ్రీరామునిసృష్టి యనియే, శ్రీరాముని విలాసము లనియే భావించును.

తాను వసియించు పల్లెయం దొక దివ్యమందిర నిర్మాణముఁ జేయించి, తాను పెద్దలవలన వినినయట్లుగ శ్రీరామ చంద్రునిదివ్యమంగళవిగ్రహముఁ జేయించి, యందుఁ బ్రతిష్ఠించి, నిరంతరమును వాని భజించుచు నానందపడుచుండును. గుహుండు శ్రీరాముని స్వయంబుగా నెఱుంగకున్నను తాను వినిన చందమున నాతఁడు శ్రీరాముని రూపమును దనహృదయ ఫలకంబునఁ గూడఁ జిత్రింబుగా లిఖయించుకొనుటచే నేవేళయందు శ్రీరామమూర్తి స్వయంబుగాఁ గాన్పించినను నానవాలుఁ బట్టఁగలఁడు. ఆకాలమున మనము గుహుని జూచియుండుట తటస్థమై యున్నచో శ్రీరాముఁ డీతని హృదయంబునఁ బ్రవేశించి సకల మానవులఁ దన పవిత్రనామ మును జపియింపఁజేసి యీవిశ్వమును బవిత్రపఱచుచుండెనా యనెడి యబ్బురమును దప్పకఁ జెందెడివారము.

రామభక్తుఁడైనంతమాత్రమున తన కులవృత్తిని నిర సించి యూరకుండెనా? కులవృత్తికి లోనై, ధనమే ప్రధాన మని యిహపరసాధక మార్గంబులఁ ద్యజియించుకొనెనా ?

తాను నిర్వహింపవలసిన కార్యములను చేతిక్రిందఁ బరిచారకు లెందఱో కలరు గదా యనెడి గర్వమున నితరులచేఁ జేయిం చెనా! ఒడలు దాఁచుకొనక, నీతిఁద్యజింపక, దైవమును మఱువక, సత్యముఁ దప్పక, ద్రవ్యమాసింపక, విసుఁగు వహింపక, కోపమూనక, రేయియనక, పవలనక, ఎండయనక, వానయనక, చలియనక, విశ్వసేవావ్రత పరాయణుండై ప్రవ ర్తించు గుహుని వర్తనమును గూర్చి వ్రాయుట కొక కవిచాలఁడు.

తాను నడిపెడి నావ నెక్కు-వారికడనుండి ప్రతిఫల ముగాఁ జిల్లి గవ్వనేనిఁ; గొని యెఱుంగఁడు. ప్రతిఫలాపేక్షా రహితుఁడై నావను నడుపుకొను గుహుండు తన దారాసుతా దుల నెటులఁ బోషించుచుండెడివాఁ డను సందియము ప్రతి వారికిఁ గలుగుట సహజము. గంగ కిరుప్రక్క-లనుండు భూమి యంతయు నరణ్యమే. ఆయరణ్యమునిండఁ గావలసినన్ని దుంప లును, గాయకూరలుచులభించుచెడివి. నీరమునకా కొఱంత లేదు గదా? వియన్న దీనీరంబులెట్టివాని కేని నాకలిదప్పులని శ్శేషముగాఁ దీర్చుచుండ గుహునకింక లోపమేమియుండును? నివాసయోగ్య ములగుకుటీరముల నేర్పఱచుకొనుటకావశ్యములగు పర్ణములాది గాఁగల పరికరములన్నియు నాయరణ్యమున మిక్కు-టముగా లభించుచుండుటచేత నాకొఱంత కూడ వానికి లేదు. ఇతర వస్తువులతోఁ గాని, యితర భోగములతోఁ గాని, యితర

ప్రసంగములతోఁ గాని వానికేమియుఁ బ్రసక్తి లేదు. పరులా నోటివెంట నితర ప్రసంగము లేమివచ్చినను జెవుల మూసికొని తన పనులయందే తాను నిమగ్నుఁడగును. ఆతని నావపై కెక్కువారలందఱును గాషాయాంబరధారులే. ఆకలములతో నాకలిని, గంగానదీ జలంబులతో దప్పిని దీర్చుకొనెడివారే. శ్రీహరి నామ సంకీర్తనా నిరతులే. అపార తపోవ్రత వ్యాపార పారీణులే. శాంతహృదయులే. నిరాడంబరప్రవృత్తిఁ గలవారే. నిష్కామ యోగాభ్యాసకులే. అందుచే నాతని సుగుణంబులకుఁదోడు సజ్జన సహవాసముఁగూడ చక్కఁగా నలవడినవి. ఈ సజ్జన సహవాసము వలన నాతఁడు పరిపూర్ణ విజ్ఞాన దక్షుఁడైనాఁడు.

శ్రీరామాదులు గంగాతీరమునకుఁ జేరుసరికి నావ యావలిదరి నున్నది. మఱల నీవలి యొడ్డునకు వచ్చుటకుఁ బాంధులు వచ్చియుండలేదు. అందుచే నించుకంత యాలస్యమయ్యెను. శ్రీరాముండు సీతాలక్ష్మణులతో నత్తావున నున్న యిసుకతిన్నెలపైఁ గూర్చుండి యాస్థలవినోదములఁగూర్చియు, నీశ్వరుని సృష్టిచాతుర్యముఁ గూర్చియు, వారికిఁ దెలుపుచుండెను. గుహుం డావలియొడ్డున నుండియే యీదరికిఁ జేరిన శ్రీరామచంద్రాదుల యాకారముల బాగుగాఁ బరికించి వారిలో శ్రీరాముఁడు కలఁడని నిశ్చయించుకొని తనకు జగత్కల్యాణ సంధాయకుని దర్శింపఁగల భాగ్యమబ్బినది గదా యని సంత

సించుచు నెప్పుడీదరికివచ్చి శ్రీరాముని పాదారవిందములకు నమస్కరింతునా యనెడి యాతురముం జూపుచుండెను. ఈయొడ్డుననున్న లక్ష్మణుండు పల్లెకులజుఁడై నావనడుపుటయందు సుప్రసిద్ధుఁడై తానొంటిగా నావనీదరికిఁ గొనిరాఁగల శక్తియుండియు నిర్లక్ష్యము సేయుచుండెనని లోలోనఁ దలంచుచు సాధ్యమైనంతవఱ కన్నగారు గుర్తింపకుండునటులఁ దన సహజక్రోధమును గ్రమక్రమముగాఁ బ్రకటముఁ జేయుచుండెను.

ఇంతలోఁ దెఱువరులు కొందఱు వచ్చిరి. శ్రీరాముండు గుహునిదెసఁ జూచి "ఓయీ! పల్లెవాఁడా! ఇంకనైన పడవ నీవలికిఁ ద్వరితముగాఁ గొనిరమ్ము, ఇప్పటికే కాలాతీతమైన"దని కేకవేసెను. గుహుం డాకేకను వినిపించుకొననటుల నటించుచు బాటసారుల నావపై నెక్కించుకొని వచ్చుచు సగము దూరము వచ్చినపిమ్మట శ్రీరామాదులు వినునట్లుగా నా పాంథులతో "నార్యులారా! వింటిరా! నేను పల్లెవాఁడనఁట. ఆకేక వేసినయతండు పల్లెవాఁడుకాఁడట. తన్ను నేనెఱుంగనని, తన కులగోత్రాదులఁగూర్చి నేను వినలేదని, మాయిరువురకుఁ గల సంబంధ బాంధవ్యముల మఱచితినని, నేనే నావదాటించెడి వృత్తియందుండి తనవృత్తికిఁ బోటీగానుంటినని మీయెదుట నల్లరిచేయవలయునని యటులఁ బ్రవర్తించుచున్నాఁడు. ధనువుఁ జేతధరించినంత మాత్రముననే కులము దాఁగునా! వృత్తి

దాఁగునా ? పంచాంగము లగుపించనికారణమున నక్షత్రము
లగుపింపవా? నన్ను హేళనచేసెడి యీపురుషునియందు నేనేల
గౌరవముంచవలెను? కానిండు. ఆదరిఁ జేరనిండు. మీయందఱి
సమక్షముననే యాతండును నావలెనే పల్లెవాఁడనియు, నావ
నడుపుచు వ్యవహరించువాఁడనియు నేను నిరూపించెదను.

ఒకవేళ నాకంటెఁ దనకెక్కుడు ప్రజ్ఞ యుండవచ్చును.
తన్నుమించెడివా రీచతుర్దశభువనంబులందు లేకపోవచ్చును.
అంతమాత్రముచే సాటివృత్తిఁగలవాని నన్నధిక్షేపింపఁ దన
కుచితమగునా!" యని చెప్పుచుండెను. వినుచున్న యాతెఱు
వరు లాశ్చర్యచకితులగుచుండిరి. వారును శ్రీరామునియెఱింగిన
వారే. వాని యత్యద్భుత మాహాత్మ్యములఁ దెలిసికొనినవారే.
కాని యాతఁ డేయభిప్రాయముతో నటుల శ్రీరామునియెడఁ
దిరస్కార భావమును జూపుచున్నాఁడో గుర్తింపలేకుండిరి.

నావ యీవలయొడ్డునకు వచ్చుచునేయున్నది. గుహుం
డవ్విధంబునఁ బలుకుచుండియుఁ దనకార్యమును మఱచియుండ
లేదు. గుహునివాక్యంబులు వినుసరికి లక్ష్మణునకుఁ గోపము
వచ్చినది. లేచినిలువబడి గుహునిపైవిడువ బాణమును సంధిం
చెను. రాముఁడుచూచి "లక్ష్మణా! ఏమది? ఇప్పుడు నీవు ధను
ష్పాణివై నిలువఁ గతంబేమి!" యని ప్రశ్నించెను.

"అగ్రజా! హీనకులజుండయ్యు మనపరిపాలనమునకు
లోఁబడినవాఁడయ్యు జగత్పూజ్యుండవనియెడి తాత్పర్యము

లేక నిచ్చవచ్చినటులఁ బ్రేలుచున్న నాతుంటరి వాక్యంబుల నాలించితివే? అట్టికర్ణకఠోరవాక్యంబుల నాలించిన నామనం బూరటఁజెందఁగలదా? ఇట్టి పరమదుర్మార్గుని వెంటనే రూపు మాపకున్నఁ బ్రపంచము నిలువఁగలదా! అన్నా! విజ్ఞాన సంపన్నా! తత్క్షణంబాజ్ఞనిచ్చున"దని లక్ష్మణుండువాకుృచ్చెను.

"లక్ష్మణా! ఈశ్వరసృష్టియందు హీనకులజులనియు, నగ్రజులనియుఁ దారతమ్యములేదు. ఈశ్వరునిదృష్టియం దెట్టి భేదభావమును గన్పట్టను. వృత్తులను బట్టి వారిలోవారు కులములేర్పఱచుకొని ప్రవర్తించుచున్నను గౌరవముపట్ల నందఱును సమానులేగదా? నేను "బల్లెవాడా"! యని సంబోధించుటలో దోసమేమున్నదియో, అందులకాతండు సమాధానమేమి చెప్పునో విచారింతము. నీకోపము నుపసంహరించు కొనుము. మన మేవిషయమునందును దొందరఁ జెందరాదు. ఎదుటివారి మనోభిప్రాయములను బాగుగా గ్రహింపవలయును. అతఁడీదరికి వచ్చునుగదా? అటుల నేలఁబలికెనో వానినే యడిగిన నీసంశయములు తీఱఁగలవు. ఆనావపై వచ్చెడి జనము నందునిల్పి వాని సమాధానమెఱింగి దోషియైనచోఁ దగినటుల మందలింపనగును. మఱియొక విశేషము. నేను వచియించు యీసదుపదేశమును నీ హృన్మందిరంబున నిలుపుకొమ్ము. నీవు సహజకోపిష్ఠుఁడవు. మనము పోవు నున్నది విపినములకు. అందు జడదారు లనేకులు కాన్పింతురు.

వారు మనకు సదాపూజనీయులు. ఎదుటవారి స్వభావమును బట్టియు, వారివర్తనాదికములఁ బట్టియు మనము నడుచుకొనవలయును. మన ధర్మంబుల మనము పాటింపకున్నచోఁ గలిగెడి యపకీర్తి యింతయని చెప్పలేము. ఇంతియే ప్రస్తుతము నేను చెప్పున"దని శ్రీరాముఁడు తన సహజశాంతవచనములతో లక్ష్మణుని శాంతపఱచెను.

ఇంతలో నావవచ్చినది. బాటసారులు నావపై నుండి దిగిరి. వారితోఁబాటు గుహుండును దిగెను. బాటసారులొడ్డుననున్న సీతారామలక్ష్మణుల యపూర్వతేజోవిలాసముల సందర్శించుచు నిశ్చేష్టులయి యుండిరి. పూర్వజన్మ సుకృతముచే లభియించిన విజ్ఞానముచే గుహుండు శ్రీరామునకుఁ దొలుత ప్రదక్షిణ నమస్కారములఁ గావించె. పదంపడి సీతాలక్ష్మణులకుఁ బ్రణమిల్లెను. శ్రీరామచంద్రుఁ డాప్తబంధుల కుశలంబులఁ గూర్చి తెలిసికొనెను. వారును అచ్చటచ్చట రాక్షసులవలనఁ బడుచున్న బాధలను గూర్చి యోచింగించిరి. రాముండు చిఱునవ్వు మోమునఁ దాండవింప గుహునిదిక్కు " ఓయీ! ఇంతకుమున్ను నీవు నావఁ గొనివచ్చుచు నీ తెఱువరులతోఁ బ్రసంగించుచున్న వాక్యముల నా కెఱింగించి నీ వాక్యంబుల సమర్థించుకొని మా లక్ష్మణునకుఁ గలిగిన సంశయంబుల నివారింపు" మనియెను.

గుహుఁడు కరంబులజోడించి "శ్రీరామచంద్రమూర్తీ నేనల్పుఁడను. నీవధికుఁడవు. ఆర్యుఁడవు. ఆదిమధ్యాంతరహితుఁడవు. సర్వభూతాంతర్బహిస్సంగతుఁడవు. నీయెదుటనిలిచియల్పజ్ఞుఁడను నేను మాటాడుటయన నెట్టులుండునో నీవెఱుంగనిదియా! ఏకార్య నిర్వహణంబునకై నన్నీయెడనిల్పితివో నీకుఁ దెలియనిదియా ! ఇట్టులనేకదా ! నీవుచిత్రవిచిత్ర నాటకముల నాడించుట? ఏవానిముఖారవింద సందర్శన మహాభాగ్యమును బొందఁగోరితినో అట్టి మహానుభావునిఁ గనులారఁ గనుఁగొనుటచే నాజన్మము పవిత్రమైనది, నాపాపంబులు పటాపంచలైనవి. ఓకౌసల్యాగర్భ జలధిరాకాసుధాకరా! నేనుమిమ్ముల నాకులమునకుఁ బెద్దఁగాఁజేసి యీమహాత్ములతో వచియించుచుంటిని. అట్టులాడఁదగిన హేతువేమని నీవడుగుచుంటివి. ఇంతకుమున్నే నా వాక్యంబులందు దోసంబు లుండియుండుననెడి యభిప్రాయముతో యిమ్మహానుభావుండు నాపై బాణముఁ బ్రయోగింపఁ దలఁచినాఁ"డని లక్ష్మణునిఁ జూపుచు మఱల నిటులఁ బలికెను. "ఓ ప్రభూ ! నేను వానికిఁ దెలిపిన యంశముల మీ సమక్షంబున మఱలఁ దెలుపుచున్నాఁడను. నా వాక్యములందుఁ దప్పులున్న క్షమింపుఁడని వేఁడువాఁడను గాను. నేనుకొద్దిపాటి వెడల్పుగల యీ నదిని మాత్రమే దాఁటించువాఁడను. అంతవఱకే నాకు శక్తి గలదు. ఇఁకనీవో అపారసంసారపారావారంబునఁబడి దా

తెన్నుఁ గనుఁగొనలేనివారి నందఱి నొడ్డుఁ జేర్పఁగల నావి
కుఁడవు. అందులకు సమర్థుఁడవు నీవొక్కరుఁడవే. నీయట్టి
మహానావికుఁ డీపదునాలుగులోకంబులం దొకొక్కఁడు
కలఁడే? నావికత్వమున నాకన్న నెన్నికోట్లుమడుంగులో యెక్కుఁ
డగు వాఁడవు, సందియంబులేదు. కాని వృత్తియందు సమాను
లమేకదా! అట్టి యెడ నిన్ను పెద్దపల్లెకారీ! యని పిలుచుటలో
లోపమున్నదా! ఈ పథికు లీరహస్యము నెఱింగిన వార
య్యును నాహృదయమం దడఁగియున్న నిశ్చితోద్దేశమును
వెలిఁబుచ్చితిని. నీవట్టి నావికుండ వగుదువో కావో; ఒడు
దుడుకు లెన్ని వాటిల్లినను యొరుల సహాయ మపేక్షింపకయే
నిన్ను నమ్ముకొని వచ్చువారి నుద్ధరింతువో! లేదో! నాన
వదుపుటయందు నాకుఁ దగిన నేర్పులేదని నన్నుఁ బరిహసించు
చుంటివో! లేదో! నిక్కంబు వక్కాణింపుము." గుహుని విశాల
హృదయంబునకును నిష్కామైక భక్తికిని శ్రీరాముఁడెంతయు
సంతసించి లక్ష్మణుని దిక్కుంజూచి "సౌమిత్రీ! గుహుని వాక్యంబుల
వింటివికదా! ఇప్పుడు నీబాణమును ప్రయోగింపవచ్చునని"
యనెను. లక్ష్మణుఁడు తన రెండు చెంపలను వాయించుకొని
రాముని పాదములపై వ్రాలి "అన్నా! విజ్ఞానసంపన్నుఁడవు,
పితృ సముఁడవు, నాయెడ బ్రేమఁ జూపువాఁడవు.
పోషకుఁడవు; అజ్ఞుఁడనై యవాచ్యములఁ బ్రేలితిని.
ఈగుహుం డింతటిమహోత్తరమగు భక్తిగలవాఁడని తెలిసికొన

లేకపోతిని. అంతదనుక నీయొక నేనే దృఢమైన భక్తిఁగలవాఁడ ననియెడి గర్వముతో నుంటిని. ప్రపంచమున నన్ను మించిన మహాభక్తులెందఱో గలరనియెడి యాథార్థ్యము నిప్పుడే యెఱింగితిని. నన్ను మన్నింపుము. అని ప్రార్థించెను. వెంటనే రాముఁడు "తమ్ముఁడా! లెమ్ము భయములేదు. క్షమియించితిని మడుకుఁదన మెన్నటికేని హానిదెచ్చును. ముక్కుపచ్చ లాఱని వారము. ప్రాపంచికానుభవము లేనివారము. నూతనముగా స్వయంకృషిచే లోకజ్ఞానమెఱుంగ నభిలషించి యీప్రాంతములకు వచ్చినవారము. మనస్వగుణములను బాగుచేసికొనుచు లోకమున కాదర్శప్రాయుల మైనపుడే యొరులలోపముల విమర్శింపవలయును. అప్పుడు మాత్రమే యొరుల దురహంకార మడంపవలయును. మనవాదము సహేతుకముగా నుండవలయును. జీవకోటి కంతకును మనదయారసంబును బ్రకటింపవలయును. క్షత్రియ కులోద్భవులమని, బాహుబలపరాక్రమ సంపన్నులమని, యధికారులమని, ధనుర్విద్యానైపుణ్యులమని యెవ్వరినో బక్కరక్కసులఁ బదిమందినిఁ గూల్చితిమని మన బాహుబలమును వ్యర్థముగా నేరిపైఁ జూపరాదు. గుహుని వాక్యములలో నెట్టియంతరార్థము కలదో, యెట్టి మహత్తరములగు విషయములను మనము గ్రహింపవలసి యున్నదో, యట్టివాని కెట్టిపదవి యిచ్చిన లోకము సంతసింపఁగలదో వానివాక్యమున కెట్టి సమాధాన మిత్తువో యోచింపుకొను"

మని హితంబులఁ గఱపుచు గుహునిదిక్కు "పిన్నవాఁడగుటచే యుక్తాయుక్త విచక్షణ లేనివాఁడయి పలికిన పలుకుల కలుకఁ జెందకుము. నేను మందలించితి" ననుచుండఁగనే సుమిత్రా కుమారుఁడు గుహుని చెంతకుఁ జని వాని కరంబుల రెంటిఁ బుచ్చుకొని "ఓయీ ! భక్తాగ్రేసరా! నీయాకారమును జూచి నీవుచేయుచున్న వృత్తిని జూచి, యజ్ఞుఁడ నగుటచే నన్యముగ భావించి తూలనాడితిని. క్షమియింపుము. సకలలోక సంరక్షణ కర్తయగు శ్రీరామచంద్రునిచే స్వయముగాఁ గీర్తింపఁబడిన నీవు; సంసారసాగరంబును దరింపఁజేయఁగల పరాత్పరునే నావపై నెక్కించుకొని యీ వియన్నదీ ప్రవాహమును దాఁటింపనున్న నీవు, తారకమంత్ర రహస్యమెఱింగి తదనుకూల వర్తివై మెలంగుచున్న నీవు, కంటకావృతమై క్రూరమృగ సంకులంబై యొప్పారు యీవిజనారణ్యమధ్యంబున నుట్టిమహాః తపస్సంపన్నుల సహచర్యముచేఁ బరిపూర్ణపండితుఁడవై విలసిల్లుచున్న నీవు, నీశక్తిని, నీవినయసంపన్నతను, నిని రాడంబర వృత్తిని నీనిష్పాక్షికబుద్ధిని నీఋజువర్తనమును, నీక్షమాగుణ సంపత్తిని నిగూఢముగ నుంచి, భస్మచ్ఛన్నానలునివోలెఁ బ్రవర్తించుచుంటివి. ఇట్టి మహత్తర గుణములచే విలసిల్లు నీయొక్క బుద్ధికుశలతనుఁ దెలిసికొని వర్ణించుట కొకనాలుక చాలునా ? శ్రీరామ పదారవింద భజనానందమునసేమి ? మఱొక గుణమునందేమి ? నీకుసాటినీవే. సూర్యునకుఁ దేజము

చంద్రునకుఁజల్లదనము, చందనమునకుసుగంధము, సహజముగఁ గలిగినట్లు" నీకురామభక్తి, వినయసంపత్తి, మొదలగు సుగుణములు సహజముగనే కలిగినవి. అని గుహుని వినుతించి యాతని నానంద పరవశునిఁగావించె.

బాటసారులైవచ్చి నావదిగినవారు సామాన్యులుకారు. అఖండమహిమాన్వితులు. జితేంద్రియులు, నిర్లేపులు, నిరహంకారులు, శాంతమూర్తులు, తపస్సంపన్నులు, నగు పుణ్యపురుషులు. ఈనాటక ప్రదర్శన వీక్షణోత్సాహులై భగవంతునిచేఁ బ్రేరేపింపఁ బడినవారే. ఈశ్వరసంకల్పము లేనిచో నేకార్యమునకుఁ గారణముండదు. విజయముండదు. వారందఱు శ్రీరామమూర్తియొక్క పవిత్రచారిత్రము నప్పుడపుడు చూచుచున్నవారే. గుహుండు లక్ష్మణుని వినయంబునకెంతయో మెచ్చుకొనియెను. శ్రీరామునివంకఁ జూచెను. "ఓ సర్వకారుణ్యమూర్తీ! శ్రీరామచంద్రమూర్తీ! అంతయు బాగుగనే యున్నది; కాని యింతటి రాజ్యమును విడిచి, భోగభాగ్యంబుల ద్యజియించి, యీనారబట్టలతో, సీతమ్మని నీయిల్లాలిని వెంటనిడుకొని యీప్రదేశంబునకు విచ్చేయుటకు మహత్తరమగు కారణంబేదియో యుండవచ్చును; విననర్హుఁడనగుదునేని సెలవీయఁగోరెద "నన శ్రీరాముండు తదుదంతమును దెలుప లక్ష్మణున కాజ్ఞనిచ్చెను.

లక్ష్మణుండు తన తండ్రిగారిని కైకమ్మ కోరినవరంబులనుఁ గూర్చియు, నందులకై తండ్రిగారుపొందిన పశ్చాత్తాపమును గూర్చియు, శ్రీరాముని యౌదార్యవాక్యంబులఁ గూర్చియు, సవిస్తరముగా విన్నవించెను.

గుహుఁడు శ్రీరామారణ్యవాస కారణంబును గ్రహియించి దీనవదనుఁడై "రామా! సకలసుగుణాభిరామా! రఘుకులాన్వయసోమా! కైకమ్మకు నీవిభవంబులఁ జూచుటకుఁ గన్నులు గుట్టెనా! తండ్రీ! దివ్యభోగంబుల ననుభవింప వలసిన నీవు సామంతప్రభువుల కప్పంబులఁగొనుచు, వందిమాగధుల కైవారంబులఁగొనుచు, శత్రురాజన్యమస్తకంబుల నిరవశేషంబుగా ఖండించుచు, న్యాయాన్యాయ విమర్శనముఁ జేయుచు, సమస్తలోకంబులను శాంతిప్రదముగాఁ బాలింపవలసిననీవు అయ్యో! జటావల్కలంబుల ధరియించి యరణ్యములకు వెడలి కందమూలాదుల నారగించుచు ఘోరమృగంబుల భీకరగర్జనంబుల నాలించుచు, గటికి రానేల గడ్డఁబఱచుకొని పరుండుచుఁ బదునాలుగేండ్లిడుములఁ గుడువఁ దలఁచితివా! రామా! ఎట్టి విపరీతదశ వాటిల్లెఁ" దని విచారింపసాగెను.
సీతమ్మను జూచి, ఈ కుసుమకోమలి, యీసుకుమారగాత్రి యెండకన్నెఱుఁగక చంద్రకాంత శిలాసౌధములలో హాయిగ నివసించి దాసదాసీజనములచేలాలింపబడుచు మెలఁగు, యీ రాజకుమారి, యీ దశరథక్ష్మాపాలుని మన్ననలందెడి

సాధ్వి, యీసకలలోకైక విభుఁడగు శ్రీరామచంద్రునియర్ధాంగి, యీ జనకాత్మసుత, యీ సీత, అక్కటా, దుర్విధి వశమున, కటికి, యీ మహారణ్యమునఁ బాదసంచారిణియై నడుచుచు కాయగడ్డలఁదిని యాకలి నడంచుకొనవలసినస్థితి వచ్చినదిగదాయని విచారించెను. అంత సౌమిత్రిని బరికించి రామానుజా ! రామసేవ సలిపి రామకరుణకుఁ బాత్రులయి కృతార్థులగు వారిలో నీవు మొట్టమొదటివాఁడవు. నీజన్మమే జన్మము" అని లక్ష్మణునిఁ గొనియాడెను.

బాటసారులగు మునీంద్రులును, శ్రీ రామ చంద్రమూర్తియు నా గుహుని దగురీతి నోదార్చి కాలవిళంబనము లేకుండఁ దన్నావలి యొడ్డునకుఁ జేర్చుమని యర్థించినంత "బ్రహ్మేంద్రాది దేవతావర్గమున కేని నప్రయత్నముగా లభియింపనేరనట్టియుఁ, దారకనామునైనట్టియు, బరమమునీంద్రుల పొగడ్తల ననవరతముఁ బొందునట్టియు మహా పురుషుఁడగు శ్రీరామచంద్రమూర్తి నావలిదరికిఁ జేర్చుట కేనెంత పుణ్యాత్ముఁడనో" యని యబ్బురమందుచు క్షణములో నా మహామహుల నందఱిని నావయెక్కించెను. చివఱకు శ్రీరాముండు మాత్రము నిలిచెను. "రామా ! ఆగుమాగుము నీపాదములఁ గడిగెదను, ఆవలనావ నెక్కవచ్చును. మీపాదములం దేవస్త్రుపునైన నాఁడువాండ్రఁజేసెడిశక్తి యున్నదఁట. నానావ యాఁడుదియైనచో నాకు వేరు జీవనాధారములేదు

నేనీనావనే యాధారముగాఁ గొని జీవించుచుంటి" నన సర్వజనహృదయాభిజ్ఞుఁడగు శ్రీరాముఁడు పక్కున నవ్వి "నీ యభీష్టమెటులనో యటులనే గావింపుమా" మ్మని తన పాదంబులఁ గడుగ నిచ్చెను.

సీత గుహుని నిరుపమాన భక్తివిలసనమునకుఁ బ్రేమాదాద్భుతములు మనంబున ముప్పిరిఁగొన, నిట్లు తలఁచెను, "అయ్యారే! ఈతఁ డెట్టి కృతకృత్యుఁడనవచ్చును? నీచకులమునం దీతఁడు జనించినను, శాంత భక్తి వైరాగ్యములచే నీతఁడు మిన్నయైనవాఁడు. రామభక్తి యీతనికి బ్రకృతి సిద్ధముగ వచ్చినదే కాని మఱి వేఱు కాదు. ఈగుహుని ప్రతిమాటయు, మన్మనోనాథుఁడగు శ్రీరామచంద్రమూర్తి హృదయము నాకర్షించు చున్నయది. ఎట్టియోగుల కేని నలభ్యంబగు మత్ప్రాణనాథునిదివ్యపాదతీర్థము గుహునకులభించుటచే నీతఁడసమాన సుకృతరాశియని చెప్పనొప్పును. ఈతఁ డనుపమపుణ్యవంతుఁ డగుటచేతనే, మన్నాథుఁడీతని యనుగ్రహించెను.

గుహుఁడు శ్రీరాముని పాదద్వయంబుల నెత్తిపైఁ జల్లుకొని తనివిఁదీఱ శ్రీరామ మహిమాభివర్ణనముఁ జేయుచుఁ దాను స్వయముగాఁ బడవ నెక్కించి యావలి యొడ్డునకుఁ జేర్చెను.

ఆదరిని వారినందఱిని దింపి తన భక్తినైపుణ్యముచే మఱల శ్రీరాముని నుతింపదొడంగెను. శ్రీరాముండు

వానియెడ దయఁగలిగి "మమ్మీ నావఁదాటించినందులకుఁ బ్రతిఫలముగా నేమికావలయునో గోరుకొ" మ్మన "దేవా! మహానుభావా! కోరుట కేమియున్నది? నాకు ధనధాన్యములు కావలయునా? అమూల్యాంబర భూషణంబులు కావలయునా? భోగములు కావలయునా! మిమ్మెట్లు గంగను నీనదిని దాటించితినో నీవుఁగూడ నన్నావిధంబుగాఁ దరింపఁ జేయుటయే నేనుగోరున" దనియె. అందుల కెంతయో సంతసించి శ్రీరాముం డట్లనే యగుఁగాక యని యాశీర్వదించి వెంటనున్నవారితో వెడలి యందందుఁ దన దర్శనలాలసులై స్వాగతంబొసంగిన వారినెల్లఱ నాదరించి మొదటి ప్రకరణమున వచియించినదండకారణ్యమునకుఁ జేరి యట ప్రవాసకాలముఁ గడుపుచుండెను.

సంసారసాగరోత్తారకమగు శ్రీరామచంద్రుని పవిత్రనామాక్షరములను త్రికరణశుద్ధిగ నిత్యము జపించుచు, శ్రీరామానుగ్రహమునంది, శాశ్వతానందసౌఖ్యములనలరి, చిరయశోభిరాముఁడయి విరాజిల్లినవారిలో గుహుఁడే మొట్టమొదట లెక్కింపఁదగినవాఁడని యీ చారిత్రమువలన వేద్యమగుచున్నది.

అట్టి మహనీయుఁడనియు, నిష్కల్మషైకభక్తివిలసనుఁడనియు, తెలిసికొనియే రావణసంహారానంతరమున సాకేతము

నకు శ్రీరామచంద్రమూర్తి పుష్పకమధిరోహించి మగిడివచ్చునపుడు సాకేతపురమునకు గుహుని రావలసినదిగా శ్రీ హనుమానునితో వార్తనంపి పట్టాభిషేక సమయమున గుహునిఁ బ్రేమపూర్వకముగ లాలించి శాశ్వతానందపదవి నొసంగెను.

సంపూర్ణము.

ఏలూరు శ్రీ పాండురంగ ముద్రాక్షరశాలా ముద్రితము.